



గాడితప్పిన పాలన!

రెవెన్యూ విభాగంపై సర్వత్రా విమర్శలు

ఉదయం డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

- సాయంత్రం ఆ ఉత్తర్వుల ఉపసంహరణ
- కలెక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నది ఎవరు?
- ఏసీబీ కేసులో ఆర్డీవో కార్యాలయం ఉద్యోగుల పేర్లు చేర్చేందుకు రంగం సిద్ధం!
- మచిలీపట్నం నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో తారాస్థాయికి విభేదాలు

జిల్లా రెవెన్యూ విభాగంలో పాలన గాడి తప్పింది. ఓ డిప్యూటీ తహసీల్దార్‌ను ఉదయం బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చి.. సాయంత్రం ఉపసంహరించుకున్నారు. దీని వెనక ఏం జరిగిందనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆర్డీవో కార్యాలయంలో కీలక అధికారిని తప్పించి, పలువురు ఉద్యోగుల పేర్లు ఏసీబీ కేసులో చేర్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. మచిలీపట్నం నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో కొంతకాలంగా కొనసాగుతున్న విభేదాలు ఇటీవల తారాస్థాయికి చేరాయి. దీంతో అసలు రెవెన్యూ విభాగంలో ఏం జరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ఉద్యోగుల తీరుపై విమర్శలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలోని తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్లతో పాటు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లను ఇటీవల కాలంలో బదిలీ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ ఉత్తర్వులు అమలులోకి రాకుండా పలువురు పావులు కదుపుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. పలువురు ఎమ్మెల్యేలు కొందరు ఉద్యోగులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఉద్యోగులు కూడా ఇన్‌చార్జి పోస్టులు కాకుండా పూర్తి బాధ్యతలు ఇస్తేనే సంబంధిత పోస్టుల్లో చేరుతామని చెబుతున్నారని సమాచారం. ఒకటీ రెండు మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉండటంతో, ఆ పోస్టులలో తమను నియమించాలని ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. దీంతో కలెక్టర్ ఆచితూచి వ్యవహరించి వివాదాలకు దూరంగా ఉండేవారిని ఆయా

మిగతా 4లో..

కలెక్టరేట్



ఉత్తర్వుల ఉపసంహరణ వెనుక ఏం జరిగింది?

మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ తహసీల్దార్‌ను కృత్తివెన్ను మండలానికి బదిలీ చేస్తూ శనివారం కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. సాయంత్రానికి ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. దీని వెనుక లాబీయింగ్ నడిచిందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్‌లోని మండలాల్లో వివాదాస్పదంగా మారిన కొందరు డిప్యూటీ తహసీల్దార్‌లను వేరే మండలాలకు బదిలీ చేయాలని ఓ మంత్రి నేరుగా కలెక్టర్‌కు ఇటీవల లేఖ రాసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ స్పందించి ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను బదిలీ చేయగా, కొద్ది గంటల్లోనే ఆ ఉత్తర్వులను నిలిపివేయడం వెనుక ఏం జరిగిందనే అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

కంప్యూటర్ ఆపరేటర్‌లను బదిలీ చేస్తారా?

జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఎన్నికల విభాగంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌లు 30 మందిని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఇటీవల బదిలీ చేశారు. దీంతో మిగిలిన తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌లను కూడా బదిలీ చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఇటీవల కాలంలో తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌లను కలెక్టరేట్‌కు పిలిచి ఎవరెవరు, ఎంతకాలంగా మండలాల్లో పనిచేస్తున్నారు, తదితర వివరాలను సేకరించారు. దీంతో తమను బదిలీలు చేస్తారని కంప్యూటర్ ఆపరేటర్‌లు చెప్పుకుంటున్నారు. విద్యాసంవత్సరం మధ్యలో బదిలీలు చేస్తే ఎలాగని కొందరు అంటుండగా, కొన్ని మండలాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌లు తాము పనిచేసే మండలంలో పని ఒత్తిడి అధికంగా ఉందని, వేరే మండలాలకు బదిలీ చేస్తే వెళ్లిపోతామని చెబుతున్నారు.

అధికారులు, ఉద్యోగుల మధ్య విభేదాలు!

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నార్త్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల మధ్య విభేదాలతో పాలన కుంటుపడిందనే విమర్శలు వస్తున్నాయి. పరిపాలనాపరమైన అంశాలు, నగదు పంపకాల్లో తేడాలు వచ్చి ఇటీవల కాలంలో అధికారులు, ఉద్యోగులు ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకున్నట్టు తెలిసింది. తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను సరెండర్ చేసుకోవాలని కలెక్టర్‌కు లేఖరాసే వరకు పరిస్థితి వెళ్లింది. తహసీల్దార్ కొద్ది రోజులుగా కార్యాలయానికి వచ్చి, వెంటనే బయటకు వెళ్లిపోతున్నారని కార్యాలయ ఉద్యోగులు అంటున్నారు. బయట ఉండే లాగిన్‌లో వేలిముద్రలు వేస్తున్నారని చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో సెలవు పెట్టిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తాను ఈ కార్యాలయంలో పనిచేయలేనని, తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, తనను వేరే మండలానికి బదిలీ చేయాలని డీఆర్వోకు ఇటీవల లేఖ ఇచ్చి మళ్లీ సెలవు పెట్టడం గమనార్హం.

గుడ్లవల్లేరులో తీన్‌మార్ డప్పులతో వినాయకుని గ్రామోత్సవం



• నిమజ్జనోత్సవం

జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రులు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ రూపాల్లో గణనాథుడిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో వినాయకుడిని ఊరేగించి సమీపంలోని కాల్వలు, కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బై బై గణేశా అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు.

-ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం

బోధనేతర పనులు రద్దు చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్

4

డాక్టర్ శర్మిష్ఠను సత్కరిస్తున్న వైద్యులు, అధికారులు



శర్మిష్ఠ సేవలు వెలకట్టలేనివి

- ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాచర్ల సుహాసిని
- ఘనంగా కృష్ణాజిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ఉద్యోగ విరమణ సభ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కరోనా కష్టకాలంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిగా డాక్టర్ శర్మిష్ఠ చేసిన సేవలు వెలకట్టలేనివని ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి మాచర్ల సుహాసిని అన్నారు. ఆదివారం జిల్లాకోర్టు సెంటర్‌లోని ఒక సమావేశపు హాలులో డాక్టర్ శర్మిష్ఠ ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పలువురు వైద్యులు సేవలందించారని, వారిలో శర్మిష్ఠ ఒకరని గుర్తు చేసుకున్నారు. వైద్యశాఖలో శర్మిష్ఠ 38 ఏళ్లపాటు అంకితభావంతో పనిచేశారని తెలిపారు. అనంతరం శర్మిష్ఠ, చిత్తజల్లు సాయిప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అమృతం పాల్గొన్నారు.



గుడివాడలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



కలశాభిషేకం

స్థానిక కొత్తపేటలోని శ్రీవిజయదుర్గ దేవస్థానం 18వ వార్షిక మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట నుంచి మచిలీపట్నం రోడ్డులోని పెద్ద కాల్వ సెంటర్ వరకు ఊరేగింపుగా వెళ్లారు. పెద్ద కాల్వలో గంగానమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు.

-ఆంధ్రజ్యోతి-గుడివాడ

పూజలు మరింత చేరువగా..



- టికెట్ ధరలు తగ్గించే యోచన
- పరోక్ష విధానంలో మాత్రమే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా ఉత్సవాల సమయంలో ఇంద్రకీలాద్రిపై నిర్వహించే ప్రత్యేక పూజలను పరోక్ష విధానంలో చేయించుకునే భక్తుల విషయంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకోనుంది. కుంకుమార్చనలు, శ్రీచక్రనవార్చన, చండీహోమం, ఖడ్గమాలార్చనకు ఫీజులను గణనీయంగా తగ్గించాలని అధికారులు యోచిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో పరోక్ష పూజా విధానంలో కుంకుమార్చనకు రూ.3 వేల చార్జీ వసూలు చేస్తున్నారు. అలాగే శ్రీచక్రనవార్చనకు రూ.3 వేలు, చండీహోమానికి రూ.4 వేలు, ప్రత్యేక లక్షకుంకుమార్చనకు రూ.5 వేలు, ఖడ్గమాలార్చనకు రూ.5,116 చొప్పున టికెట్ వసూలు చేస్తున్నారు. ఈ టికెట్ ధరలను రూ.1,000-రూ.1,500 వరకు తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు. వీలైనంత ఎక్కువమంది భక్తులకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతోనే రేట్లు తగ్గించాలనేది దేవస్థాన అధికారుల భావన. పరోక్ష విధానంలో పూజలు చేయించుకునే వారికి దేవస్థానం పూజల ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేలా లింక్ ఇస్తారు. ఈ లింక్ ద్వారా ఇంటి నుంచి పూజలు వీక్షించవచ్చు. ఆ తర్వాత అమ్మవారి ప్రసాదం, రాగి డాలర్, వస్త్రం తదితరాలను భక్తుల ఇంటికే పంపించే ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా అంబటి



అంబటి వెంకట్రావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్యశాఖాధికారిగా అంబటి వెంకట్రావు నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన డాక్టర్ సి.ఎస్.శర్మిష్ఠ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో జిల్లా టీబీ, ఎయిడ్స్, కుష్టువ్యాధి నివారణాధికారి డాక్టర్ అంబటి వెంకట్రావును జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



దసరా అదిరేలా..

- అంబరాన్నంటేలా ' దసరా ఉత్సవ్ '
- నగరమంతా జిగేల్‌మనేలా లైటింగ్
- గొల్లపూడిలో భారీ ఎగ్జిబిషన్
- బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్

4

మరువని విలయం

బుడమేరు వరద బీభత్సానికి ఏడాది

2024, ఆగస్టు 31 అర్ధరాత్రి.. తెల్లవారితే సెప్టెంబరు 1.. అందరికీ కేవలం నెల మాత్రమే మారితే, విజయవాడ వాసుల జీవితాలు మాత్రం పూర్తిగా మారిపోయాయి. బుడమేరు సృష్టించిన బీభత్సానికి విజయవాడలోని 50 శాతం ప్రాంతంతో పాటు రూరల్ మండలాలు, మైలవరంలోని ప్రాంతాలు నీటమునిగిపోయాయి. 4.5 లక్షల మంది ప్రజలు నిలువనీడ లేకుండాపోయారు. రూ.కోట్లలో ఆస్తినష్టం సంభవించింది. తినడానికి తిండిలేక, కట్టుకునేందుకు దుస్తులులేక సుమారు 15 రోజుల పాటు నరకయాతన అనుభవించారు. ప్రభుత్వం అందించిన సాయం, దాతల దాతృత్వం కాస్త చేయూతనిచ్చినా.. ఈ విలయానికి నేటికీ కోలుకోని అభాగ్యులెందరో ఉన్నారు. అందుకే.. చిన్నపాటి వర్షానికి కూడా బుడమేరు ఎప్పుడొస్తుందోనని బెజవాడవాసులు నేటికీ భయంతోనే బిక్కుబిక్కుమంటున్నారు. భవిష్యత్తులో ఇలాంటి భయంకరమైన రోజులు పునరావృత్తం కాకుండా ఉండాలన్నా.. బెజవాడవాసుల భయం తొలగిపోవాలన్నా.. బుడమేరు వరద నివారణకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది. బుడమేరు జల ప్రళయానికి నేటికి ఏడాది అయిన సందర్భంగా ప్రత్యేక కథనం..

బెజవాడ సహా రూరల్ ప్రాంతాలు నీటమునక

- 4.5 లక్షల మందిపై ముంపు ప్రభావం.. రూ.కోట్లలో నష్టం
- ఇల్లు నీటమునిగి సర్వం కోల్పోయిన వారెందరో..
- షాపులు, గోడౌన్లు నాశనమై నష్టపోయిన వారెందరో..
- ఏడాది అవుతున్నా నేటికీ బుడమేరు అంటేనే ఓ భయం
- వర్షం వస్తే వరద వస్తుందేమోననే వణుకు
- వెలగలేరు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణంతో కాస్త ఉపశమనం
- శాశ్వత పరిష్కారం చూపించాలంటున్న బెజవాడవాసులు





(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇబ్రహీంపట్నం) : 1964 నాటి వరద బీభత్సాన్ని గుర్తుచేస్తూ సరిగ్గా 60 ఏళ్ల తర్వాత 2024, సెప్టెంబరు 1న బుడమేరు మహోగ్రరూపం దాల్చి బెజవాడను ముంచేసింది. మైలవరంతో పాటు విజయవాడ రూరల్ గ్రామాల్లోకి పరుగులు పెట్టింది. గత ఏడాది ఆగస్టు 31 రాత్రి సుమారు 30 సెంటీమీటర్ల వర్షం కురవడంతో పాటు కొండవాగు, కోతులవాగు, పులివాగుతో పాటు అనేక వాగులు పొంగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్దకు సుమారు 40 వేల క్యూసెక్కుల వరద చేరింది. రెగ్యులేటర్ గేట్ల పైనుంచి వరద ప్రవహించింది. ఈ దశలో రెగ్యులేటర్ నుంచి బుడమేరు వరద మళ్లింపు కాల్వకు (బీడీసీ)కు

మిగతా 4లో..



శాశ్వత పరిష్కారం అవసరం

బుడమేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం లభించాలంటే వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ దిగువ భాగం నుంచి ఎనికేపాడు యూటీ వరకూ ఇప్పుడున్న కాల్వకు సమాంతరంగా మరో 25 కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయంగా మరో కాల్వ తవ్వాలి. ఎనికేపాడు యూటీ సామర్థ్యాన్ని 4 వేల క్యూసెక్కుల నుంచి 20 వేల క్యూసెక్కులకు పెంచాలి. కొల్లేరు నుంచి ఉప్పుటేరు మీదుగా బుడమేరు డ్రెయిన్ నీరు సముద్రంలోకి పోయేలా డీసిల్టింగ్ పనులు చేయాలి. ఎనికేపాడు నుంచి కొల్లేరు వరకు 57 కిలోమీటర్ల పొడవునా బుడమేరు డ్రెయినేజీ పూడిక తీయాలి. ఇందుకు రూ.5,800 కోట్ల నిధులు కావాలని జలవనరుల శాఖ అధికారులు డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపారు.





దసరా అదిరేలా..!

అంబరాన్నంటే సంబరంగా 'దసరా ఉత్సవ్'

- నగరమంతా జిగేల్‌మనేలా లైటింగ్ ● గొల్లపూడిలో భారీ ఎగ్జిబిషన్ ● బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్
- ఐజీఎంసీ నుంచి హెలీ రైడింగ్ ● నగరంలో తొలిసారిగా ఎయిర్‌బెలూన్స్ ● చవులూరించే ఫుడ్ ఫెస్టివల్స్





ఆంధ్రజ్యోతి, విజయవాడ: జిగేల్‌మనే లైటింగ్, వీనులవిందైన సంగీతం, బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్, రంగురంగుల ఎయిర్‌బెలూన్స్‌పై విహారం, హెలీ రైడింగ్, ఎగ్జిబిషన్, ఫుడ్ ఫెస్టివల్స్‌తో ఈసారి దసరా ఉత్సవాలు విజయవాడలో 11 రోజుల పాటు అంబరాన్నంటే సంబరాలు జరగబోతున్నాయి. నగరం దేదీప్యమానంగా వెలుగొందబోతోంది. ధూమ్‌ధామ్‌గా 'దసరా ఉత్సవ్'ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు నగరం ఈసారి గ్రాండ్ వెల్కమ్ పలకబోతోంది. కనకదుర్గమ్మ దర్శనానికి నగరానికి వచ్చిన వారిని రెండు, మూడు రోజుల పాటు ఇక్కడే ఉండేలా, వారిని కట్టిపడేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా విశేషాలను మరికొద్ది రోజుల్లో అధికారికంగా జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ప్రకటించబోతున్నారు. కనీవినీ ఎరుగనిరీతిలో 'దసరా ఉత్సవ్' నిర్వహనకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలోనరి హోటళ్ల యాజమాన్యాలకు, లాడ్జీలకు వసతి కల్పించటానికి సిద్ధంగా ఉండాలంటూ సందేశాలు పంపే స్థాయికి చేరుకుంది. కొండపై దసరా ఉత్సవాల సందడి, కొండ దిగువున నగర వ్యాప్తంగా కోలాహలంతో అంబరాన్నంటే సంబరాలే సాక్షాత్కరిస్తున్నాయి.

ఎంపీ శివనాథ్ చొరవతో..

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ సంయుక్తంగా 'దసరా ఉత్సవ్'ను నగర చరిత్రలో లిఖించేలా నిర్వహించేందుకు సారథ్యం వహిస్తున్నారు. దసరా ఉత్సవ్‌పై ఇప్పటికే పలుమార్లు విస్తృత స్థాయిలో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

గొల్లపూడిలో భారీ ఎగ్జిబిషన్

గత దశాబ్దంన్నర కాలంగా నగరంలో నిలిచిపోయిన కృష్ణా పారిశ్రామిక, వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను మళ్లీ దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్నారు. స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు కారణంగా గొల్లపూడిలో దేవదాయశాఖకు చెందిన స్థలంలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకుల సౌజన్యంతో భారీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చరిత్రలో నిలిచేలా నిర్వహించాలని ఎగ్జిబిషన్ సొసైటీ భావిస్తోంది. దాదాపుగా 450 పైగా రాష్ట్ర, జాతీయ స్టాల్స్ ఏర్పాటు జరుగుతోంది. ఎగ్జిబిషన్‌ను వినోదాత్మకంగా తీర్చిదిద్దేందుకు, పిల్లలు, కుటుంబాలు తరలివచ్చేలా సరికొత్త ఆకర్షణలతో నిర్వహించబోతోంది. అమ్మ దర్శనానికి వచ్చిన వారంతా ఎగ్జిబిషన్‌ను చూడటానికి వచ్చేలా విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు.

తొలిసారిగా ఎయిర్ బెలూన్స్

అభివృద్ధి చెందిన పర్యాటక దేశాల్లో చూసే రంగురంగుల ఎయిర్‌బెలూన్స్ మన రాబోతున్నాయి. బెలూన్ తొట్టిల్లో నుంచుని బెజవాడ ఏరియల్ వ్యూ చూస్తూ ఆనందించవచ్చు. స్టేడియం, హరిత బెర్మ్‌పార్క్, ప్రకాశం బ్యారేజీ తదితర సందర్శనీయ ప్రాంతాల నుంచి ఎయిర్ బెలూన్స్ ఆపరేషన్ నిర్వహణకు ఆలోచనలు చేస్తున్నారు. నిర్వాహకులతో సంప్రదింపులు చేస్తున్నారు.

హెలీ రైడింగ్

ఉత్సవాల 11 రోజుల పాటు నగరంలో హెలీ రైడింగ్ నిర్వహించబోతున్నారు. అతి తక్కువ చార్జీతోనే హెలికాప్టర్‌లో చక్కెర్లు కొట్టే అవకాశాన్ని నగర ప్రజలకు, దసరా ఉత్సవాల సందర్శకులకు కల్పిస్తోంది. హెలీ రైడ్ ఐజీఎంసీ నుంచి బయలుదేరి కృష్ణానది మీదుగా అమరావతి, కనకదుర్గమ్మ ఆలయం మీదుగా తిరిగి ఐజీఎంసీకి వెళ్లేలా రూట్ ప్లాన్ చేస్తున్నారు.



బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్

దసరా అంటేనే పగటి వేషాలు. కానీ వీటిని మనం మరిచిపోయాం. అందుకే వాటితోపాటు మరికొన్ని ఆకర్షణలను జతకూర్చి దసరా కార్నివాల్స్ నిర్వహించేలా ప్లాన్ చేశారు. బందరు రోడ్డుపై 11 రోజుల పాటు ఈ దసరా కార్నివాల్స్ నిర్వహించనున్నారు. మేళతాళాలు, బ్యాండ్, డీజేలు, రకరకాల వాయిద్యాలు, సంగీతం, పగటి వేషాల హడావిడితో సందడిగా మారబోతోంది.

విద్యుత్‌కాంతులతో ధగధగలు

నగరమంతా విద్యుత్ కాంతులతో ధగధగమనిపించేలా చేయబోతున్నారు. ప్రధాన రోడ్లు, ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, రింగ్‌లు అన్ని చోట్లా లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక ప్రత్యేక ఆకర్షణతో కూడిన లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. రాత్రుళ్లు వీటిని చూస్తూ ఆస్వాదించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పగటిపూట తోరణాలు, ఆర్చిలు వంటివి పైన చెప్పుకున్న ప్రాంతాల్లో కనువిందు చేయనున్నాయి.

సంగీత స్వరాలు

దసరా ఉత్సవాల నేపథ్యంలో వీనులవిందైన సంగీతం వినేలా ఏర్పాట్లు చేస్తారు. నగర ప్రధాన రోడ్లు, కూడళ్లు, జనసమ్మర్ద ప్రాంతాలు అన్నిచోట్లా సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచి సంగీతం వినేలా అమ్మవారి పూజలు, పాటలతో భక్తిపారవశ్య కలిగించేలా ఏర్పాట్లు చేయనున్నారు.

ఘుమఘుమలాడే ఫుడ్ ఫెస్టివల్స్

నగరంలో ఉత్సవాలు ముగిసేవరకు కోరుకున్నవారికి కోరినన్ని రుచులతో నాలుగైదు ప్రాంతాల్లో ఫుడ్‌ఫెస్టివల్స్‌ను నిర్వహించనున్నారు. వెజ్, నాన్‌వెజ్‌తో పాటు ఫాస్ట్‌ఫుడ్ రుచులన్నీ అందుబాటులోకి తెచ్చి భోజన ప్రియులను సంతుష్టపరచాలని ఏర్పాట్లు చేస్తున్నారు.

మ్యూజికల్ నైట్స్‌తో జోష్

కనకదుర్గమ్మ గుడి వద్ద శాస్త్రీయ నృత్యాలను ఈసారి భారీగా ఏర్పాటు చేస్తారు. ఇవి కాకుండా నగరంలో మ్యూజికల్ నైట్స్ నిర్వహించనున్నారు. కృష్ణానది ఒడ్డున, అంబేద్కర్ స్మృతివనం, ఐజీఎంసీ వంటిచోట్ల మ్యూజికల్ నైట్స్ నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పలు మ్యూజికల్ ఈవెంట్స్ సంస్థలతో సంప్రదింపులు చేపట్టారు.

హైకోర్టులో కొలువుల పేరుతో టోకరా

- వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.6.52 లక్షలు వసూలు
- పోలీసులకు చిక్కిన నిందితురాలు

విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో ఉద్యోగాలున్నాయి. రూ.లక్ష చూసుకోండి. ఉద్యోగం ఇప్పించే బాధ్యత నాదంటూ పలువురిని నమ్మించి ఓ మహిళ నిలువునా ముంచేసింది. ఆమె మోసాలను గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేశారు. గురునానక్ కాలనీకి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళ మధురానగర్‌కు చెందిన రంజుల స్వర్ణకు మారి ఇంటిలో పనులు చేస్తోంది. కొద్దినెలల క్రితం ఈశ్వరమ్మతో మాటలు కలిపి తాను హైకోర్టులో ఉద్యోగాలిప్పిస్తానని, రూ.లక్ష ఖర్చవుతుందని నమ్మించింది. అంతేకాక ఉద్యోగం కావల్సినవారిని తీసుకురావాలని చెప్పింది. ముందుగా ఉద్యోగం కోసం ఈశ్వరమ్మ రూ.లక్ష ఇచ్చింది. తర్వాత మరికొంతమందితో ఇప్పించింది. నెలలు గడుస్తున్నా ఉద్యోగ సమాచారం ఇవ్వకపోవడంతో ఈశ్వరమ్మ నిలదీసింది. కొన్ని డబ్బులు చెల్లించినా మిగతా చెల్లించకపోవడంతో సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆదివారం ఆమెను అరెస్టు చేసి న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు. గతంలోనూ కొంతమందిని ఇలాగే మోసం చేసింది. ఆమెపై గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో రెండు, గుణదల, మాచవరం, తుళ్లూరు పోలీస్ స్టేషన్లలో ఒక్కో కేసు ఉన్నాయి. కొన్ని కేసుల్లో లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకుంది. రాజీ కుదరలేని కేసులు కోర్టు విచారణలో ఉన్నాయి.



యాక్సిస్ బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీటీపీఎస్ పాత గేటు సమీపంలోని యాక్సిస్ బ్యాంక్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ దొంగ చోరీకి యత్నించి విఫలమయ్యాడు. బ్యాంక్ ఎదుట ఉన్న ఏటీఎమ్ సెంటర్‌లోకి ప్రవేశించిన ఒక గుర్తు తెలియని వ్యక్తి బ్యాంక్ షట్టర్ తాళం పగులకొట్టి బ్యాంక్‌లోకి ప్రవేశించడంతో థెఫ్ట్ అలారం మోగింది. దీంతో పరారయ్యాడు. ఈ విషయాన్ని ముంబయి కమాండ్ సెంటర్‌లోని సిబ్బంది సీసీ కెమెరాల్లో చూసి పోలీసులకు తెలపడంతో వారు హుటాహుటిన బ్యాంక్ వద్దకు చేరుకునే లోపు దొంగ తప్పించుకున్నాడు. బ్రాంచ్ మేనేజర్ మునీర్ బ్యాంక్‌కు వచ్చి లోనికి వెళ్లి అన్ని పరిశీలించి చూసుకున్నారు. ఎలాంటి వస్తువులు పోలేదని నిర్ధారించుకున్నారు. బ్రాంచ్‌మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో

నగర క్రీడాకారులకు బంగారు పతకాలు

లబ్బీపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని మౌంట్ వారెన్ క్వీన్స్‌ల్యాండ్‌లో జరిగిన 2025 వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్‌లో భారతీయ స్కేటింగ్ క్రీడాకారులు పీ చైత్రిక దీపిక, హృతిక్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జైత్రయాత్ర సాగించారు. నగరానికి చెందిన చైత్ర దీపిక పెయిర్ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగంలో, కపుల్ డాన్స్ విభాగంలో బంగారు పతకాలు సాధించింది. వీ హృతిక్ ఇన్‌లైన్ విభాగంలో, పెయిర్ విభాగంలో, కపుల్ డాన్స్ విభాగంలో బంగారు పతకాలు, సోలో డాన్స్‌లో సిల్వర్ పతకం సాదించి దేశానికి పేరు తెచ్చారు.

బోధనేతర పనులు రద్దు చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

మైలవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పాఠశాలల్లో ఆన్లైన్ వర్క్‌లతో విలువైన బోధన సమయానికి నష్టం వాటిల్లిదుందని ప్రభుత్వం స్పందించి బోధేనతర పనులను వెంటనే రద్దు చేయాలని యూతఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన యూటీఎఫ్ మ ధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత యూటీఎఫ్ జెండాను జిల్లా మాజీ గౌరవాధ్యక్షుడు జీ పాల్ బాబురావు, సీనియర్ నేత పీ వెంకటేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణయ్య, యూటీఎఫ్ నేతలు కే గంగరాజు, టీ సూర్యనారాయణ, పీ భవానీ, బీ సుదానంద్, ఎం లింగారెడ్డి, బీ రెడ్ స్టార్, డీ హరిప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు, ఏ అనంత్‌కుమార్, జే గంగరాజు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్ ముత్తయ్య, ఎల్ చంటి, కే నాగేశ్వరరావు, సీఐటీయూ నేతలు సుధాకర్, ఎం తిరుపతిరావు, వాడపల్లి వసంతరావు, ఎం లక్ష్మి, విజయలక్ష్మి, జీ రామకృష్ణ పాల్గొన్నారు.

పెజ్జోనిపేటలో జోరుగా గంజాయి అమ్మకాలు

● గంజాయికి బానిసలవుతున్న యువత ● తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య? ● తల్లిదండ్రుల ఆందోళన

వన్‌టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెజ్జోనిపేటలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ప్రాంతం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి రైళ్లలో అక్రమంగా గంజాయిని ఇక్కడికి తరలిస్తున్నారు. ఇక్కడ నుంచి చిన్న చిన్న పొట్లాలుగా తయారు చేసి యువకులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పలువురు యువకులు దీనికి బానిసలవుతున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించినప్పటికీ మార్పు రావటం లేదు. సుమారు 10 రోజుల క్రితం ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థి గంజాయికి బానిసయ్యాడు. తండ్రి గుర్తించి మందలించటంతో మనస్తాపం చెందిన ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజూ వందలాది రైళ్లు వస్తూ పోతుంటాయి. ఈక్రమంలో కొందరు ముఠాగా ఏర్పడి విశాఖపట్నం, విజయనగరం, ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి



పెద్ద మొత్తంలో రైళ్ల ద్వారా గంజాయిని తరలిస్తున్నారు. ప్రధాన స్టేషన్‌కు దగ్గరగా ఉన్న పాత రాజరాజేశ్వరి పేట వద్ద రైళ్లు తప్పనిసరిగా ఆగుతుటాంటాయి. ఆ సమయంలో గంజాయి తరలించేవారు రైలు నుంచి గంజాయి బండిల్స్‌ను దించి పాత రాజరాజేశ్వరి పేట, ఖుద్దూస్‌నగర్, పెజ్జోనిపేట, సమీప ప్రాంతాలకు తరలిస్తారు. ముఖ్యంగా విజయవాడ రైల్వే డీఆర్ఎం కార్యాలయం సమీపంలో, పెజ్జోనిపేట, పాత రైల్వే ట్రాక్ కట్ట, లోకోషెడ్డు, నైజాంగేటు, పాతరాజరాజేశ్వరి పేట వద్ద గంజాయి పొట్లాలు జోరుగా విక్రయిస్తుంటారు. రాత్రి, పగలు తేడా లేకుండా విజయవాడ డీఆర్ఎం కార్యాలయం సమీపంలోనే బహిరంగంగానే విక్రయిస్తున్నట్లు కొందరు రైల్వే ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పెజ్జోనిపేట డేవిడ్ వీధి, మసీదు సెంటర్, పప్పుల మిల్లు సెంటర్ ప్రాంతాల్లో గంజాయి పొట్లాలు విక్రయిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో ఇద్దరు మహిళలు గుట్టుచప్పుడు కాకుండా రైల్వేస్టేషన్, ఆటో స్టాండ్, పప్పులమిల్లు సెంటర్ వద్ద గంజాయి పొట్లాలు విక్రయిస్తున్నట్లు ఆటో డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులను టార్గెట్ చేసుకుని మొదట్లో తక్కువ ధరకు అలవాటుపడిన తరువాత ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ అమ్మకాలపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారుల పర్యవేక్షణ లేనందునే అమ్మకాలు సాగుతున్నాయని బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం రావాలి

- కృష్ణాజిల్లా విశ్రాంత కలెక్టర్ ఇంతియాజ్

విజయవాడ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కవులు సమాజం పట్ల బాధ్యత వహించి చైతన్యవంతమైన ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం సృజన చేయాలని కృష్ణాజిల్లా విశ్రాంత కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆదివారం ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కవితల పోటీ విజేతలకు 2024 ఎక్స్ రే అవార్డుల ప్రదానం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్ నందు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ సామాన్యులకూ అర్థమయ్యే భాషలో కవిత్వం రావాలన్నారు. మహిళలు కూడా కవిత్వ రచనలో ముందుండాలని డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి అన్నారు. ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎక్స్‌రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలికారు. ప్రధాన అవార్డు గ్రహీతగా కస్నీటి రణం కవిత రచించిన మానుకోటకు చెందిన అక్షరం ప్రభాకర్‌కు రూ.12 వేల నగదు, జ్ఞాపిక, శాలువతో వేదికపై ఉన్న కలెక్టర్లచే సన్మానం జరిగింది. ఉత్తమ కవులుగా మామిడిశెట్టి శ్రీనివాసరావు (దొడ్డిపట్ల), శ్రీధర్‌బాబు (నెల్లూరు), చిత్రాడ కిషోర్ కుమార్ (విజయవాడ), జగరాపు శంకరరావు (గజపతినగరం), శ్రీకంఠస్ఫూర్తి (విజయవాడ), దుప్పటి రమేష్‌బాబు (నెల్లూరు), ధవళేశ్వరరావు రవికుమార్ (విశాఖపట్నం), డాక్టర్ కోరుప్రోలు హరనాథ్‌బాబు (హైదరాబాద్)లు వెయ్యి రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువా అవార్డుతో సత్కరించారు. వేదికపై శ్రీశ్రీ సాహిత్యానిధి సింగంపల్లి అశోక్‌కుమార్, హెచ్‌ఆర్‌పీఎస్ నేషనల్ కమిటీ కంచర్ల ముత్య ప్రసాద్, కవి కేవీ శ్యాంసుందర్, నందనోదయ ప్రసంగించారు. న్యాయనిర్ణేత, కవి, జర్నలిస్ట్ సర్వజిత్ బహుమతి కవితలను విశ్లేషించారు. సభ ప్రారంభంలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, పొత్తూరి సీతారామారావు, బీ వసంత కుమార్, కొల్లూరి కనకవల్లి పర్యవేక్షించారు.


ఎక్స్‌రే కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్


సైకిల్ రైడ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆరోగ్య గమ్యానికి సైకిల్ సవారీ

- సైకిల్ రైడ్‌లో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం, ఆహ్లాదం, ఆపై పర్యావరణ పరిరక్షణకూ సైక్లింగ్ చేయూతనిస్తుందని, చిన్నారులు, యువత సైకిల్ సవారీని అలవాటుగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పెడల్ ఫర్ ఫిట్‌నెస్ అండ్ యూనిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. డాక్టర్ అంబేద్కర్ స్మృతివనం నుంచి ప్రారంభమైన ఈ రైడ్ బెంజిసర్కిల్, రామవరప్పాడు, బీఆర్‌టీఎస్ రోడ్డు, గాంధీనగర్, మున్సిపల్ ఆఫీసు, ప్రకాశం బ్యారేజి, కంట్రోల్ రూమ్, స్టేడియం వరకు మొత్తం 21 కి.మీ మేర సాగింది. దాదాపు 80 మంది సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లండన్ ఎడిన్బర్గ్ - లండన్ (ఎల్‌ఈఎల్) సైక్లింగ్ ఈవెంట్ - 2025లో పాల్గొన్న నిషికాంత్‌ను కలెక్టర్ అభినందించారు. అమరావతి రన్నర్స్ ప్రెసిడెంట్ ఆర్ రమేష్ రవి, సభ్యులు బసవేశ్వరరావు, జీవీ సత్యనారాయణ, నిషికాంత్‌తో పాటు సీవైసీవో, డెకథ్లాన్ సైక్లింగ్ క్లబ్స్ సభ్యులు, సిటీ రన్నర్స్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

లబ్బీపేట: ప్రతి ఒక్కరూ యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉండొచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఐజీఎంసీ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి యోగాసన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్రను చక్కగా నిర్వహించి వరల్డ్ రికార్డ్ నమోదు చేశారని, యోగా ద్వారా మానసికంగా, శారీరంగా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. యోగా అసోసియేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకొనిపోదాం

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరికి కాకతీయ సేవా సమితి సన్మానం

మొగల్రాజపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం మన కమ్యూనిటీని అభివృద్ధి చేసుకుంటూ మిగిలిన కమ్యూనిటీలను కలుపుకుని పోదామని ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాదెండ్ల బ్రహ్మం చౌదరి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ఎగ్జిక్యూటివ్ సమావేశం మొగల్రాజపురంలో ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాదెండ్ల బ్రహ్మం చౌదరికి సమాఖ్య ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కమ్మవారిలో ఐక్యత తీసుకొచ్చిన ఘటన వైకాపా ప్రభుత్వం చంద్రబాబును అరెస్టు చేయడమేనన్నారు. పార్టీకి తాను చేసిన సేవకు గుర్తింపుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని వారికి ధన్యవాదాలు చెప్పారు. అనంతరం సమాఖ్య తరువత అధ్యక్ష కార్యదర్శులు కొడాలి వెంకట సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ అమరావతిలో ఐదెకరాలు, జిల్లా కేంద్రాల్లో ఎకరం చొప్పున భూమిని కేటాయిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తీసుకుంటామన్నారు. తద్వారా కమ్యూనిటీ అభివృద్ధి, సేవాకార్యక్రమాలకు ఊతమిచ్చిన వారవుతారని విజ్ఞప్తి చేశారు. సమాఖ్య జాయింట్ సెక్రటరీ జీఎల్‌కే ప్రసాద్, మన్నే ప్రసాద్, సాయితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన సమాఖ్య సభ్యులు, జిల్లా సంఘాల నేతలు పాల్గొన్నారు.


బ్రహ్మం చౌదరిని సత్కరిస్తున్న నేతలు

సీపీడీసీఎల్ ఎస్‌ఈగా హనుమయ్య



విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీపీడీసీఎల్ ఎన్టీఆర్ జిల్లా సర్కిల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉప్పలపాటి హనుమయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్‌ఈగా పనిచేసిన తోట శ్రీనివాసరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో హనుమయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఎస్‌ఈ కార్యాలయంలో టెక్నికల్ విభాగం డీఈగా పనిచేస్తున్నారు. సీనియారిటీ జాబితాలోని హనుమయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు కాచిగూడ - మెదక్ రైలు రద్దు

రైల్వేస్టేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గోదావరి బ్రిడ్జి నెంబరు 434 బాసర - నవీపేట మధ్య భారీ వరదల కారణంగా హైదరాబాద్ డివిజన్‌లోని పలు రైళ్లను రద్దు చేయటం, లేదా పాక్షికంగా రద్దు చేయటం వంటివి చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 77604 మెదక్ - కాచిగూడ రైలును ఈనెల 1న రద్దు చేశారు. 77656 సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు ఈనెల 1న గద్వేల్‌లో బయలుదేరుతుంది. గద్వేల్ - సికింద్రాబాద్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

గాడితప్పిన పాలన!

(3వ పేజీ తరువాయి)

మండలాలకు ఇన్‌చార్జిలుగా ఇటీవల కాలంలో నియమించారు.

ఆర్డీవో కార్యాలయంలో కీలక అధికారిపై ఆరోపణలు

మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో జూలై 25న ఏసీబీ అధికారులు దాడులు చేసి సీనియర్ అసిస్టెంట్ బీరం త్రినాథ్ రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ల్యాండ్ కన్వర్షన్ విషయంలో నగదు ఇస్తామని చెప్పిన కొద్దిసేపటికి ఈ ఫైలుపై సంతకం పెట్టడం జరిగిందని ఏసీబీ అధికారులు ఆ రోజు చెప్పారు. అయితే ఈ కేసులో కీలక అధికారిని పనిగట్టుకుని తప్పించడానికి తెర వెనుక పెద్ద ఎత్తున మంత్రాంగమే నడిచిందని సమాచారం. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారిందనే అంశాన్ని గుర్తించిన ఏసీబీ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ కేసులో కీలకమైనవారిని వదిలివేయడంపై ఏసీబీ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో మరికొందరి పేర్లను చేరుస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది.

మరువని విలయం

(3వ పేజీ తరువాయి)

సుమారు 3.9 కిలోమీటర్ దగ్గర 200 మీటర్ల మేర మూడు భారీగండ్లు పడ్డాయి. మరోపక్క కృష్ణానదికి ఎగువ నుంచి వచ్చిన వరద పోటెత్తడంతో బీడీసీ ద్వారా నదిలోకి వెళ్లాల్సిన బుడమేరు వరద వెనక్కి ఎగదన్నింది. గండ్ల ద్వారా వరద మొత్తం విజయవాడ పల్లపు ప్రాంతాలతో పాటు మైలవరం, విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాలను ముంచెత్తింది. వందలాది ఇళ్లు నీటమునిగాయి. వేలమంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది పశువులు నీటిలోనే మునిగిపోయాయి. రూ.కోట్లలో ఆస్తినష్టం సంభవించింది. సర్వం కోల్పోయి రోడ్డును పడినవారు.. ఇప్పటికి కోలోకోలేని అభాగ్యులు ఎందరో ఉన్నారు.

బుడమేరు ఎక్కడ పుట్టింది?

తిరువూరు నియోజకవర్గంలోని చీమలపాడు-నారికంపాడు మధ్యలో 1,850 అడుగుల ఎత్తైన ప్రదేశంలో జమ్మలవాయిదుర్గం కొండల్లో బుడమేరు పుట్టింది. అక్కడ పాయగా ప్రారంభమై చీమలపాడు దగ్గర పాలవాగులో కలిసి అక్కడి నుంచి మైలవరం చేరుకుంటుంది. అక్కడ మొర్సుమల్లి కొండల్లో మరో పాయ వచ్చి కలుస్తుంది. రెడ్డిగూడెం మండలం నుంచి వచ్చే కోతుల వాగు.. నాగులూరు, కీర్తిరాయినిగూడెం, వెల్వడం మీదుగా వచ్చి జి.కొండూరు మండలం చిన్న నందిగామ దగ్గరకు చేరుతుంది. మైలవరం వైపు నుంచి వచ్చే పాయ, రెడ్డిగూడెం వైపు నుంచి వచ్చే పాయ ఇక్కడ ఏకమై బుడమేరుగా రూపాంతరం చెందుతాయి. వెల్లటూరు, కందులపాడు, ముత్యాలంపాడు మీదుగా ఇవి ప్రవహిస్తాయి. జి.కొండూరు మండలంలోనే పులివాగు, కప్పలవాగు, ఇతర కొండవాగులు కలవడంతో బుడమేరు మరింత ఉగ్రంగా ప్రవహిస్తుంది.

రిటైనింగ్ వాల్‌తో కాస్త ఉపశమనం

సెప్టెంబరులో ఒకేరోజు 30 సెంటీమీటర్ల వర్షం కురవడంతో బుడమేరుకు 40 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ పొంగి ప్రవహించింది. గేట్లు ఎత్తే లోగానే అక్కడి నుంచి సుమారు 4 కిలోమీటర్ల వద్ద బీడీసీ ఎడమ కట్టకు మూడుచోట్ల భారీగండ్లు పడటం, బెజవాడ పల్లపు ప్రాంతాలను ముంచెత్తడం జరిగిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. బుడమేరు మిగిల్చిన గాయాలకు కాయకల్ప చికిత్స చేసింది. గండ్లు పడిన ప్రదేశం దగ్గర రూ.23 కోట్లతో రిటైనింగ్ వాల్ పూర్తిచేసింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌కు మరమ్మతులు చేయించింది. అయితే చర్యలు తాత్కాలికమే కాగా, శాశ్వత ప్రాతిపదికన ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

వరదకు అడ్డంకులు తొలగించాలి

బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ) ద్వారా కృష్ణానదిలో వరద నీరు కలిసేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలి. ఎన్టీటీపీఎస్ మీదుగా వెళ్తున్న బీడీసీ కాల్వను 1.5 కిలోమీటర్ల మేర 1.5 మీటర్ల లోతు పూడిక తీయాలి. ఈ పనులు చేస్తే బీడీసీ ద్వారా సుమారు 37 వేల క్యూసెక్కుల వరద నీటిని నేరుగా కృష్ణానదిలోకి ఎలాంటి అవరోధాలు లేకుండా కలిపే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో పనులు ఉండటంతో బీడీసీ ద్వారా కేవలం 15వేల క్యూసెక్కుల వరద మాత్రమే కృష్ణానదిలోకి మళ్లిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 118, 126, 137
చికెన్ విత్ స్కిన్ 224
చికెన్ స్కిన్‌లెస్ 234
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

మొక్కులు చెల్లించిన టీడీపీ నేతలు


రాట్నాలమ్మ తల్లి ఆలయంలో టీడీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరిపూర్ణ ఆరోగ్యంతో ప్రజా సేవలోకి వస్తున్నందున మొక్కులు చెల్లించినట్లు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ తెలిపారు. బొమ్ములూరు సర్పంచ్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్‌లు రాట్నాలగుంటలో కొలువైన రాట్నాలమ్మ తల్లిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ పేరుతో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో పచ్చిగళ్ల శ్రీను, గాలంకి వినయ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణించాలంటే మంటాడ!

- అడుగడుగునా గుంతలతో ఉయ్యూరు - మంటాడ రోడ్డు
- రోడ్డుపై ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్న వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- అవస్థ పడుతున్న ప్రజలు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

అడుగడుగునా గుంతలతో ఉయ్యూరు- మంటాడ ఆర్ అండ్ బీరోడ్డు అధ్వానంగా మారింది. వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే సాహసం చేయడమే అన్నట్టుగా పరిస్థితి మారింది. ఉయ్యూరు నుంచి మంటాడ వెళ్లాంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పమిడిముక్కల, పామర్రు మండలాలనుంచి ఉయ్యూరు వైపు వచ్చి వెళ్లేందుకు ఎక్కువగా ఇదేరోడ్డు ఉపయోగిస్తుంటారు. ఈనేపథ్యంలో ఉయ్యూరు సాయిమహల్ సెంటర్ నుంచి మంటాడ శివాలయం వరకు రోడ్డు అడుగడుగునా గుంతలు పడడటంతో వాహనాలు నడిపేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. పమిడిముక్కల, పామర్రు, పరిసర మండలాల నుంచి ఉయ్యూరు వచ్చేవారు రోడ్డు దుస్థితికి భయపడి మంటాడ నుంచి జాతీయ రహదారి మీదుగా ఉయ్యూరుకు నాలుగు కిలోమీటర్ల దూరం తిరిగి రావలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు వైపు నుంచి ఉయ్యూరు వైపు వచ్చే ఆర్టీసీ బస్సులు గుంతల్లో నడపండంవల్ల మంటాడ- కేసీపీ కర్మాగారం మధ్య టైర్లు పగిలిపోవడమో, పంచర్లు పడడం, ఇతర కారణాల వల్ల మొరాయించడంతో డ్రైవర్లు బస్సులను నిలిపివేస్తుంటే ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుంది. వైసీపీ అధికారంలో ఉండగా రోడ్ల దుస్థితి కూటమి ప్రభుత్వం వస్తే మారుతుం దేమో అనుకున్న ప్రజల నమ్మకం వమ్ము చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికార పక్ష నాయకులతో పాటు అధికారులు కూడ ఈ రోడ్డు నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం

మంటాడ- ఉయ్యూరు మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై వర్షాలకు గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది గాయాలు పాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పరిస్థితిని పై అధికారులకు వివరించాము. ప్రస్తుతం మరమ్మతులకు నిధులు లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

- బలరామ్, ఉయ్యూరు ఆర్ అండ్ బీ డీఈ


అధ్వానంగా ఉయ్యూరు - మంటాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు

బురదమయంగా సూరంపల్లి తొండం బజారు రోడ్డు!



- సీసీ రోడ్డుగా మారుస్తానన్న ఎమ్మెల్యే హామీని పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఇబ్బందిపడుతున్న గ్రామస్తులు

(గన్నవరం - ఆంధ్రజ్యోతి)

మండలంలోని సూరంపల్లి బీసీ కాలనీలోని తొండం బజారులోని అంతర్గత రహదారి అధ్వానంగా మారింది. చినుకుపడితే బురదకయ్యగా మారుతుంది. ఎన్నికల సమయంలో యార్లగడ్డ వెంకట్రావు వచ్చినప్పుడు స్థానిక మహిళలు తమ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలని విన్నవించారు. అధికారంలోకి వచ్చిన తరువాత తప్పని సరిగా సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. అయితే స్థానికులు, పార్టీ నేతలు పలుమార్లు పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చినుకుపడితే ఆ రోడ్డు బురదకయ్యగా మారుతుంది. బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతు న్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇటీవల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తమకేమి పట్టనట్లు వ్యవహరించినట్లు ఫిర్యాదులు వెల్లాయి. అధికారుల అలసత్వం వల్లే తమ రోడ్డుకు ఈ దుస్థితి కలిగిందని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


అనుమోలు ప్రభాకరరావు, బొబ్బా గోపాలకృష్ణను సత్కరిస్తున్న సిద్ధార్థ పాఠశాల యాజమాన్యం

యువతకు స్ఫూర్తి అనుమోలు

పెనమలూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని 67 ఏళ్ల వయస్సులో విజయవంతంగా అధిరోహించిన టీడీపీ నేత, పోరంకి వాసి అనుమోలు ప్రభాకరరావు యువతకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఆదివారం విజయవాడ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వాకర్స్ ఆధ్వర్యంలో పర్వతారోహకులు అనుమోలు ప్రభాకరరావు, బొబ్బా గోపాలకృష్ణలకు జరిగిన సన్మాన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోరంకిలో అనుమోలు ఆదరణ ట్రస్టు ద్వారా ప్రజా సేవ చేస్తూ టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్న అనుమోలు సైక్లింగ్, వ్యాయామం, స్విమ్మింగ్ తదితర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మంచు పర్వతాలను అధిరోహించడం అభినందనీయమన్నారు. ఈ వయస్సులో సాధించిన తన రికార్డులను గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో పొందుపరచడానికి అనుమోలు చేస్తున్న కృషి ఫలించాలని ఆకాంక్షించారు. పర్వతారోహకులు అనుమోలు ప్రభాకరరావు, బొబ్బా గోపాలకృష్ణను పాఠశాల యాజమాన్యం సత్కరించారు.

టైలర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

ఉయ్యూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ షాపింగ్, రెడిమేడ్‌ల వల్ల ఉపాధి లేకుండా పోతున్న టైలర్లను ఆదుకోవాలని ఉయ్యూరు టైలర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం జరిగిన అసోసియేషన్ సమావేశం జరిగింది. అధ్యక్షుడు గేదెల వెంకట్రావు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో టైలరింగ్ పనిలేక ఇబ్బంది పడుతున్నామని, కొన్ని సంవత్సరాలుగా ఆన్‌లైన్ షాపింగ్, రెడీమేడ్‌లతో టైలర్లకు ఉపాధి లేకపోవడం, పెరిగిన షాపుల అద్దెలు, కరంటు చార్జీలతో కుటుంబ పోషణ కష్టతరం అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, సెక్రటరీ అగ్గిరాముడు, ఇబ్రహీం, అబ్దుల్ అల్తాఫ్, చింతలూరి దుర్గాప్రసాద్, భవానీ శంకర్ , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు షేక్ బాజి మృతి


షేక్ బాజి

కంకిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు షేక్ బాజి (46) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పార్టీలో బూత్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశాడు. బాజి మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, దేవినేని రాజ, తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వర రావు, గోగినేని వెంకటరమణ, చిట్టూరి నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, వీరంకి శ్యామ్, వణుకూరు విక్రం విచారం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆయన అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడరు పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం యమలకుదురులో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ఆప్రాంతంలోని బోస్ బొమ్మ సెంటరు, సంజీవనగర్, లంబాడీపేట తదితర ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని డీఈ హరిబాబు కోరారు.

ఉంగుటూరు : 33/11కేవీ మారేడుమాక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలో ఉంగుటూరు సెక్షన్ పరిధిలోని బొకినాలలో విద్యుత్ ఫీడర్ లైనుల మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30గం.ల వరకు గ్రామంలోని వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

కంకిపాడులో గణనాథుడికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రత్యేక పూజలు





కంకిపాడులో గణేశ్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూజలు .. ఉయ్యూరులో లడ్డూ వేలం పాట.. కేసరపల్లి ఎస్ఎల్‌వీలో ప్రత్యేక పూజలు.. నున్న వికాస్‌లో..

కంకిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతు బజారు వద్ద తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకట రమణ, నాయకులు కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, వీరంకి శ్యామ్, బాజి, మేదంద్రావు రాజేష్, అన్నే రామారావు, కాకమాను రమేష్ పాల్గొన్నారు.

ఉయ్యూరు : శివాలయం రోడ్డు రాఘవేంద్ర హైట్స్‌లో ఏర్పాటు చేసిన మండపంలో మట్టి వినాయకుని నిమజ్జనం వైభవంగా జరిగింది. మహిళలు, యువతీ, యువకులు సందడిగా పాల్గొన్నారు. మండపంలో లడ్డూ వేలంపాట నిర్వహించగా యలమంచిలి రామచంద్రమూర్తి రూ. 30 వేలకు పాట పాడారు. బిల్డర్ రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఉమాశంకర్, వర్షిత్, సన్నీ, భవ్య, మానస తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : గణనాథుని ఆశీస్సులు అందరికి ఉండాలని విజయ డెయిరి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని కేసరపల్లి ఎస్ఎల్‌వీలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ అందరూ భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తేనే మేలు జరుగుతుందని తెలిపారు. బీజేపీ సీనియర్ నాయకుడు, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, జాస్తి వెంకటేశ్వరరావు, కేహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ : నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో చవితి వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రేటరీ ఎన్. సత్యనారాయణ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పిఎస్. శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం, విజయవాడ రోడ్డులో సాయి రెసిడెన్సీ, ధరణీ రెసిడెన్సీ, జగనన్నకాలనీ, తారకరామ, రాజుల కాలనీ, శర్మాస్ అపార్ట్‌మెంట్, హనుమాన్‌నగర్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం నిమిత్తం ఊరేగింపుగా ఏలూరు కాలువకు తరలించారు. ఈ సందర్భంగా అన్ని చోట్ల అన్నదానం, లడ్డూ ప్రసాదం వేలం పాటలు నిర్వాహకులు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రంగన్నగూడెం, వీరవల్లి, కాకులపాడు తదితర గ్రామాల్లో వినా యకుని విగ్రహాలను ఆదివారం నిమజ్జనం సందర్భంగా గ్రామాల్లో మేళతాళాలమధ్య ఊరేగించారు. రంగన్నగూడెంలో యువ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెనిగళ్ల జ్ఞానశేఖర్, తుమ్మల విజయ్, నెరుసు వెంకటేశ్వరరావులు పర్యవేక్షించారు. కాకులపాడులో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వీరవల్లిలో గ్రామ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి లంక సురేంద్ర మోహన బెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉంగుటూరు : మండలంలోని మానికొండలో అభయ ఆంజనేయస్వామి టెంపుల్ యువత ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈసందర్భంగా నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొయ్యగూరపాడు, తరిగొప్పల, వేమండ, బొకినాల, నాగవరప్పాడు, వెంకట్రామాపురం, ఆముదాలపల్లి తదితర గ్రామాల్లో గణనాథుడి నిమజ్జనం కోలాహలంగా జరిగింది.




జంక్షన్ ధరణీ అపార్టమెంట్‌లో భక్తుల పూజలు.. రంగన్నగూడెంలో గణేశ్ విగ్రహం ఊరేగింపు..


కానూరులోని సిద్ధార్థ వర్సిటీలో సైకిల్ ర్యాలీ

ముగిసిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

కానూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని వర్సిటీ క్యాంపస్‌లో వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఆరోగ్యం, పర్యావరణ హితం ప్రాధాన్యతను విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సైక్లింగ్ అనేది కేవలం క్రీడ మాత్రమే కాదని, ఇది వ్యక్తిగత ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, డీన్ డాక్టర్ వి. వెంకట్రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శివరాంప్రసాద్, పీడీ పి. రఘు, డాక్టర్ వెంకట నారాయణతోపాటు వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘనంగా నివాళులర్పించారు.

సిద్ధార్థలో పరిశుభ్రత, క్యాన్సర్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తుమ్మల వర్షిణి

కానూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లో పరిశుభ్రత, క్యాన్సర్‌పై విద్యార్థినులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్ర ఉమెన్స్ సెంటర్ గైనకాలజిస్టు డాక్టర్ తుమ్మల వర్షిణి పాల్గొని మహిళలు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగత్తలను వివరించారు. యూత్ రెడ్‌క్రాస్ క్లబ్, ఉమెన్ ఎంపవర్ మెంట్, ఉమెన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈఅవగాహన సమావేశంలో వర్సిటీ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ సువర్ణ, వాణి, ఉషా, రమాదేవి, మాధవి పాల్గొన్నారు.

మండల సమావేశం 6న

ఉంగుటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వతేదీ శనివారం మధ్యాహ్నం 2గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన జరిగే ఈ జనరల్‌బాడీ మీటింగ్‌లో అన్నిగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రత్యేక/శాశ్వత ఆహ్వానితులు, అన్నిప్రభుత్వశాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కంకిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వృద్ధురాలు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దావులూరు టోల్ గేట్ వద్ద ఈ నెల 27వ తేదీన రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది విజయవాడ ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందింది. వృద్ధురాలి వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు శివాలయం ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వల్లభనేని అనిల్ రూ.5లక్షలు విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గూడవల్లి చిన్నాకు విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు గూడపాటి రత్నశేఖర్,తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, తుమ్మల నారాయణరావు తదితరులు దాతను అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఉయ్యూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు 4వ వార్డుకు చెందిన పీకా కృష్ణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును పార్టీ నాయకులు ఆదివారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్నాధరావు, పంద్రాజు చిరంజీవి, ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపరెడ్డి శ్రీనివాసరావు పాల్గొని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.


అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇళ్లు

గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం

- రెండు తాటాకు ఇళ్లు దగ్ధం.. సర్వం కోల్పోయిన పలగాని కొండయ్య, బాలాజీ కుటుంబాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలోని గ్యాస్ సిలిండర్ పేలడంతో సంభవించిన అగ్ని ప్రమాదంలో పూరింటితో పాటు అప్పుతెచ్చుకున్న నగదు, బంగారం ఆహుతి అయిన ఘటన సింగన్నగూడెంలో ఆదివారం జరిగింది. సింగన్నగూడెంకు చెందిన పలగాని రంగారావు కుమారులు కొండయ్య, బాలాజీలు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తూ తాటాకు ఇళ్లలో ప్రక్కప్రక్కనే నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా పేలుడు శబ్దంతో పాటు మంటలు ఎగిసిపడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు హనుమాన్‌జంక్షన్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారమందించారు. గ్రామస్తుల సహకారంతో ఫైర్ ఆఫీసర్ అమరేశ్వరరావు సిబ్బందితో కలిసి సుమారు గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. నష్టం అంచనా విలువ సుమారు రూ.4లక్షలకు పైగా ఉండవచ్చని ఫైర్‌ఆఫీసర్ తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లామని, అగ్ని ప్రమాద సమాచారం అందుకుని వచ్చే సరికి మొత్తం కాలిబూడిదయిందని బాధితులు వాపోయారు.

సింగన్నగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులను స్థానిక ప్రజాప్రతినిధుల, అధికారులు పరామర్శించారు. తహసీల్దార్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తక్షణ సాయంగా నిత్యావసరాలను అందజేశారు. టీడీపీ నేత ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణారావు, పునులూరి లక్ష్మీనారాయణ పరామర్శించారు.



దిక్సూచి

సీఎస్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

కంపెనీ సెక్రటరీ(సీఎస్) డిసెంబరు 2025 రిజిస్ట్రేషన్ కోసం 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా'(ఐసీఎస్ఐ) నోటిఫికేషన్ వెలువడింది. 2025 సెప్టెంబర్ 26 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఆలస్య రుసుముతో అక్టోబర్ 10 వరకు అవకాశం ఉంది. నోటిఫికేషన్ గైడ్‌లైన్స్ ప్రకారం 2025 డిసెంబర్ 22 నుంచి 29 వరకు హిందీ, ఇంగ్లి ష్‌లో పరీక్షలు నిర్వహించను న్నారు.



పరీక్ష ఫీజు: ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ఫీజు ఒక్క గ్రూపునకు రూ. 1500/-, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఫీజు ఒక్క గ్రూపునకు రూ.1800/-, ఆలస్య రుసుము 250/-

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 26

వెబ్‌సైట్: smash.icsi.edu



గ్రామీణ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ ప్రభుత్వం వారి స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగ యువతకు ఉచితంగా ఉద్యోగ ఆధారిత సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నారు.

కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీటీవీ టెక్నీషియన్ కోర్సు: ఆరు నెలల శిక్షణ, పదో తరగతి పాసై ఉండాలి.

టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోసీ, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్: ఆరు నెలల కోర్సు, ఎనిమిదో తరగతి పాసై ఉండాలి

ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్ - సర్వీస్: ఆరు నెలల కోర్సు, ఐటీఐ, ఇంటర్ పాసై ఉండాలి

వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్: మూడు నెలలు, పదో తరగతి పాసై ఉండాలి.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 18-25 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

కావాల్సిన పత్రాలు: అర్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డు, ఆదాయ ధృవ పత్రం. అడ్మిషన్ లభించిన వారికి ఉచిత భోజన, హాస్టల్ వసతి కల్పిస్తారు.

చిరునామా: స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్(గ్రా), పోచంపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ - 508 204(హైదరాబాద్ హయత్ నగర్ నుంచి 524 నంబర్ బస్సు ద్వారా సంస్థకు చేరుకోవచ్చు).

పూర్తి వివరాల కోసం కింది నెంబర్లను సంప్రదించవచ్చు.

అడ్మిషన్ల తేదీ: 2025 సెప్టెంబర్ 3 ఉదయం 10 గంటలకు సంస్థలో వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది.

ఫోన్: 9133908000, 9133908222, 9948466111 **వెబ్‌సైట్:** www.srtri.com/

జాబ్ కార్నర్

ఆర్ఆర్‌బీలో సెక్షన్ కంట్రోలర్స్

ఖాళీలు 368

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో మొత్తం 368 సెక్షన్ కంట్రోలర్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆర్ఆర్‌బీకి సంబంధించిన 21 రీజియన్లలో ఈ పోస్టులు ఉన్నాయి. జోన్‌వారీ ఖాళీలు, పరీక్ష విధానం తదితర వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు బోర్డు తెలిపింది.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 33 ఏళ్ల మధ్యలో ఉండాలి.

దరఖాస్తు తేదీలు: 2025 సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 14 వరకు

వెబ్‌సైట్: www.rrbapply.gov.in

పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఫీల్డ్ ఇంజనీర్లు

ఖాళీలు 1543

పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఒప్పంద ప్రాతిపదికన 1543 ఫీల్డ్ ఇంజనీర్, ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. 'పవర్ గ్రిడ్' నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పోస్టులు	ఖాళీలు
ఫీల్డ్ ఇంజనీర్(ఎలక్ట్రికల్) -	532
ఫీల్డ్ ఇంజనీర్(సివిల్) -	198
ఫీల్డ్ సూపర్‌వైజర్(ఎలక్ట్రికల్) -	535
ఫీల్డ్ సూపర్‌వైజర్(సివిల్) -	193
ఫీల్డ్ సూపర్‌వైజర్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) -	85

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ పాస్ కావడంతోపాటు, ఉద్యోగ అనుభవం ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 17 నాటికి 29 ఏళ్లు మించి ఉండరాదు. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు: ఢిల్లీ, భోపాల్, కోల్‌కతా, బెంగళూరు, గువహటి, ముంబాయి

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 1 **వెబ్‌సైట్:** www.powergrid.in/

బెల్‌లో ట్రైనీ ఇంజనీర్లు

ఖాళీలు 80

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థలో తాత్కాలిక ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్-1, ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు.

- ట్రైనీ ఇంజనీర్-1: **67 పోస్టులు**
- ప్రాజెక్ట్ ఇంజనీర్-1: **13 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, సివిల్

అర్హత: బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు, ఉద్యోగ అనుభవం

వయస్సు: 2025 ఆగస్ట్ 1 నాటికి 28 నుంచి 32 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 12

వెబ్‌సైట్: https://bel-india.in/job-notifications/

ఇంటెలిజెన్స్ బ్యూరోలో జూనియర్ ఆఫీసర్లు

ఖాళీలు 394

కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో 394 జూనియర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

అర్హత: ఇంజనీరింగ్ డిప్లొమా(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ అప్లికేషన్స్), డిగ్రీ/ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ఫిజిక్స్/మేథ్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ ఉత్తీర్ణత కలిగి ఉండాలి)

వయస్సు: 2025 సెప్టెంబర్ 14 నాటికి 18-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక:

టైర్-1: వంద మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. జనరల్ మెంటల్ ఎబిలిటీ 25 శాతం, టెక్నికల్ సబ్జెక్టులు 75 శాతం ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.

టైర్-2: 30 మార్కులకు స్కిల్ టెస్ట్ ఉంటుంది. ఇది ప్రాక్టికల్, టెక్నికల్ టెస్ట్.

టైర్-3: 20 మార్కులకు ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 14

వెబ్‌సైట్: www.ncs.gov.in, www.mha.gov.in

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో

ఖాళీలు 248

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ 248 జూనియర్ ఇంజనీర్(నాన్ ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- అసిస్టెంట్ రాజ్‌భాషా ఆఫీసర్ - **11 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(సివిల్) - **109 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్) - **46 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(మెకానికల్) - **49 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(ఈసీ) - **17 పోస్టులు**
- సూపర్‌వైజర్(ఐటీ) - **1 పోస్టు**
- సీనియర్ అకౌంటెంట్ - **10 పోస్టులు**
- హిందీ ట్రాన్స్‌లేటర్ - **05 పోస్టులు**

వయస్సు: 30 సంవత్సరాలకు మించి ఉండరాదు. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగ అనుభవం

చివరి తేదీ: 2025 అక్టోబర్ 1 **వెబ్‌సైట్:** www.nhpcindia.com/

SCHOLARSHIP ALERT

Reliance Foundation Postgraduate

The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility: Be a resident Indian citizen.

- First-year PG students who secured a score of 550 - 1,000 in the GATE Examination. OR Students who have scored 7.5 or above in their Undergraduate CGPA (or % normalised to CGPA)
- Eligible degree programmes - Computer Science, Artificial Intelligence, Mathematics & Computing, Electrical/or Electronics Engg., Chemical Engg., Mechanical Engg., Renewable & New Energy, Material, Science & Engg. and Life Sciences.

Rewards: Up to INR 6,00,000 over the duration of the degree

Last Date to Apply: 04-10-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RFS12

Undergraduate

The Reliance Foundation Undergraduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, become successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Be a resident Indian citizen

- Passed Standard 12th with minimum 60%
- Currently enrolled in the 1st year (academic year 2025-26) in a regular full-time degree course in any stream
- Students having household income < Rs. 15 Lakhs (preference given to < Rs. 2.5 Lakhs)
- Aptitude Test is mandatory

The following students are not eligible: Students who are in the 2nd year or higher (have started their courses from academic year 2024-25 or before)

- Students pursuing their degree through online, hybrid, remote, distance or any other non-regular modes
- Students who have passed their diploma after std. 10th
- Students pursuing 2-year & 6 years undergraduate degree courses

Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 04-10-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RFS13

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అనుష్క నట విశ్వరూపం చూపించబోతున్నాం



క్రిష్

'ఘాటి' చిత్రంలో అనుష్క శీలావతిగా మన ముందుకు రాబోతున్నారు. ఆమె నట విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం' అని దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అన్నారు. అనుష్కశెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రధారులుగా క్రిష్ తెరకెక్కించిన చిత్రమిది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. క్రిష్ మాట్లాడుతూ 'కొన్ని కథలు చాలా సహజంగా, పచ్చిగా, పేలడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంటాయి. అలాంటి కథ 'ఘాటి'. తూర్పు కనుమలు, ఆ పర్వత శ్రేణులు, అక్కడి దృఢమైన మనుషులు, వారి గొప్ప వ్యక్తిత్వాలను కలిపి ఒక మంచి కథను చెప్పే అవకాశం దొరికింది. విక్రమ్ ప్రభు కోసమే దేశిరాజు క్యారెక్టర్‌ని రాశాను. ఈ సినిమాకి జగపతిబాబు పాత్ర ప్రత్యేక ఆకర్షణ' అని చెప్పారు. జగపతిబాబు మాట్లాడుతూ 'అనుష్క స్వీటీ అని మనందరికీ తెలుసు. కానీ ఈ సినిమాలో ఘాటుగా ఉండబోతోంది. నేను పోలీస్ పాత్రను పోషించాను. నా పాత్రను డైరెక్టర్ క్రిష్ చాలా అద్భుతంగా రాశారు' అని చెప్పారు. విక్రమ్ ప్రభు మాట్లాడుతూ 'అనుష్క, జగపతిబాబు, చైతన్య రావుతో కలసి నటించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. నటుడు చైతన్య రావు మాట్లాడుతూ 'నా క్యారెక్టర్‌ని తెరపై చూసుకున్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. నాలో కొత్త కోణాన్ని చూపించిన దర్శకుడు క్రిష్‌కి ధన్యవాదాలు' అని అన్నారు. చిత్ర నిర్మాత రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాలో అనుష్కని రియల్ క్వీన్‌గా చూస్తారు. చాలా అద్భుతమైన సినిమా తీశాం. మేమందరం సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు.

నీ పుట్టినరోజును మిస్ అవుతున్నా



తనయుడు గౌతమ్ పుట్టినరోజు వేడుకలను మిస్ కావడం ఇదే తొలిసారి అని మహేశ్‌బాబు భావోద్వేగానికి లోనయ్యారు. ఆదివారం గౌతమ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా గౌతమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఎక్స్‌లో మహేశ్‌బాబు పోస్ట్ పెట్టారు. 'గౌతమ్ ఈ ఏడాది నీ పుట్టినరోజును మిస్ అవుతున్నాను. 19వ పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను మిస్ అయిన నీ తొలి పుట్టినరోజు ఇదే. నా ప్రేమ నీకెప్పుడూ తోడుగా ఉంటుంది. నువ్వు చేసే ప్రతీ పనికీ ఎక్కువ సంతోష పడే వ్యక్తిని నేనే. నువ్వు మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నా' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌తో దిగిన పాత ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' చిత్రీకరణలో బిజీగా ఉండటం వల్లే గౌతమ్ పుట్టినరోజు వేడుకలకు మహేశ్‌బాబు హాజరు కాలేకపోయారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

కొండాలమ్మకు పొంగళ్లు

గుడ్లవల్లేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వేమవరం శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు పాల పొంగళ్ళు వండి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం చంద్ర గ్రహణం కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం మూసి వేయనున్నారు. సోమవారం ఉదయం యథావిధిగా ఆలయం తెరచి సంప్రోక్షణ అనంతరం భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని కొండలరావు తెలిపారు.



భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

వైభవంగా గణేశ్ నిమజ్జనాలు



కూచిపూడిలో..

కూచిపూడి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు ప్రత్యేక పూజల అనంతరం ఐదవ రోజైన ఆదివారం మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించి వైభవంగా నిమజ్జన కార్యక్రమాన్ని చేశారు. కూచిపూడి, మొవ్వ, నరసంపాలెం, పెదపూడి, కోసూరు, కాజ తదితర గ్రామాల్లో నిమజ్జన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గుడివాడ :మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఐదో రోజు స్వామి వారు పంచముఖ గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) ధర్మకర్తల కమిటీ ఛైర్మన్ సాయన రాజేష్, సభ్యులు లోయ వాసు, ముళ్లపూడి రమణమూర్తి, విక్కుర్తి పోతురాజు, శ్రీనివాసరావు, శారద, శైలజ, విజయలక్ష్మీ, కనకదుర్గ భవాని, భక్తులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులను దేవస్థాన కమిటీ ఛైర్మన్ రాజేష్, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు(వాసు)లు సత్కరించి దేవాదాయ శాఖ తరుపున సర్టిఫికెట్లను అందజేశారు.



గుడివాడలో నాట్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

నందివాడ : వినాయకుని నవరాత్రులలో భాగంగా నందివాడ, జనార్ధనపురం, చినలింగాల, పెద లింగాల, ఒద్దుల మెరక, తుమ్మలపల్లి, కుదరవల్లి, లక్ష్మీనరసింహాపురం, పొలుకొండ, రుద్రపాక, తమిరిశ, గొంగళ్లమూడి, నాగభూషణపురం గ్రామాల్లో ఆదివారం వినాయక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వినాయకుడి ఊరేగింపు కార్యక్రమాలు మేళతాళాలతో తీన్‌మార్, డప్పువాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొలుకొండ చినవంతెన వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని పందిరి వద్ద ఆలయ కమిటీ సభ్యుడు తాతినేని వెంకట కృష్ణారావు (బుజ్జిబాబు), వడ్లమూడి సుధాకర్, కోనేరు రవి, పిన్నమనేని నరసింహారావు, గొట్టుముక్కల విశ్వనాథం ఆధ్వర్యంలో శనివారం రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహించారు. 6200 గ్రాముల లడ్డు కోనేరు సాయి బాబు రూ.40 వేలకు పాటలో దక్కించుకున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గారపాటి దినేష్, గోపాల్ పాల్గొన్నారు.



పామర్రులో..

పామర్రు: పామర్రులో తోటరామాలయం వద్ద , రెడ్లబజారులోని వైష్ణవాలయంవద్ద, గౌడ రామాలయం వద్ద , జమ్మిచెట్టు బజారులో ఏర్పాటుచేసిన గణేశ్ విగ్రహాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు అల్లంశెట్టి లావణ్య పవన్‌కుమార్, డాక్టర్ ఆర్‌కె విశాలక్షి, మాజీవార్డు సభ్యులు ,అల్లంశెట్టి సురేష్, అంజిబాబు, తాడిశెట్టి సాంబశివరావు, కమ్మిలి అనిల్, కమిటీ నిర్వహకులు సిద్ధంశెట్టి ఆంజనేయులు, శ్రీపతి కృష్ణ, దాసరి కొండలు పాల్గొన్నారు. స్థానిక కోరముక్కువానిపురంలో జరిగిన గణేశ్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు చైతన్య, వార్డుసభ్యుడు మంతెన రామాంజనేయులు, దాలిపర్తి ప్రసాద్‌లు పాల్గొన్నారు. కొండిపర్రులో జరిగిన పూజాల్లో ఏఎంసీ డైరెక్టర్ నూకవరపు వీరాంజనేయులు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెద ఎరుకపాడులోని కోదండరామాలయం వద్ద ఆదివారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. రూ.1,01,001లకు లడ్డూను పోతుల శ్రీకాంత్ దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌ను అభినందించారు.



పెదపారుపూడిలో..

పెదపారుపూడి : గణేశ్ నవరాత్రిని పురస్కరించుకుని వెంట్రప్రగడ, వానపాముల గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు కాగితం లక్ష్మీనారాయణ , పాగోలు శ్రీనివాసరావు, మెండెం శ్రీనివాసరావు, పోగంటి మహేష్‌బాబు, ఈడే శ్రీనివాస్ కుమార్, శ్రీనుబాబు, నాగరాజు, విజయ్ కుమార్, మెండ దాను, పవన్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు, యాకమూరు, వల్లూరుపాలెం తదితర గ్రామాల్లో మొత్తం 15 విగ్రహాల నిమజ్జనం జరిగింది. తోట్లవల్లూరులో బ్రాహ్మణ యువత ఆధ్వర్యంలో సందడిగా వినాయకుడి విగ్రహాలను ఊరేగింపు చేశారు.

పెదపారుపూడి: భూషణగుళ్లలో వీరమ్మ తల్లి గుడి సెంటర్‌లో రాము అండ్ గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6.5 అడుగుల మహాగణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొల్లు రమణ కుమార్, శ్రీకాంత్ సప్తగిరి, గోగం రామారావులు పాల్గొన్నారు. పెదపారుపూడిలో గణనాథుని నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గుప్త శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మీ, సత్య అన్వేష్, సాయి చందు, ఆజాద్, గ్రామస్తులు నిమజ్జనంలో పాల్గొన్నారు. చినపారుపూడిలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో గణేశ్ నిమజ్జనం చేశారు.



నందివాడలో..

గుడ్లవల్లేరు : వినాయక చవితి వేడుకల సందర్భంగా గుడ్లవల్లేరు సంత బజార్ లోని గణేశ్ యూత్ ఆధ్వర్యంలో రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు, పీహెచ్‌సీ కమిటీ మాజీ ఛైర్మన్ చాపరాల రాజా ప్రారంభించారు. రజక సంఘం టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని పుల్లేరులో నిమజ్జన చేశారు. గ్రామంలోని నెహ్రూ నగర్‌లోని వినాయకుడిని, కొత్తవరం మొదటివార్డులోని వినాయకుడిని గ్రామోత్సవం నిర్వహించి పుల్లేరులో నిమజ్జనం చేశారు. గ్రామస్థులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో..

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

● సీఐలు కొండపల్లి శ్రీనివాస్ , హనీష్

గుడివాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : అనుకోని కొన్ని సంఘటనల వల్ల, దురుసుగా ప్రవర్తించి, చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ రౌడీషీటర్లకు సూచించారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ హనీష్

వినాయకుని నిమజ్జన సమయాల్లో రౌడీషీటర్లు ఎటువంటి అల్లర్లు చేయరాదని, చెడు నడత వీడి సత్ప్రవర్తన కలిగి ఉండాలని టూటౌన్ సీఐ జె.ఆర్‌కె హనీష్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో ఆదివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు హాజరు కావాలని సీఐ ఆదేశించారు.

ఆర్థిక సాయం

గుడివాడ : స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఆదివారం అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డయాలసీస్ నిమిత్తం ధనలక్ష్మీకి రూ.5వేలు, దివ్యాంగుడు సాయిశ్రీకాంత్‌కు వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నారాయణరెడ్డి, రమ్యరెడ్డిలు సంస్థ కార్యకలాపాలకు రూ.5వేల చెక్కును అందజేశారు. ఉమ్మడి జిల్లా సమన్వయ కమిటీ ఛైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, జిల్లా పర్యావరణ కమిటీ ఛైర్మన్ దండమూడి జయలక్ష్మీ, జిల్లా విద్యానిధి డైరెక్టర్ ఉప్పలపాటి మారుతిప్రసాద్, జిల్లా కోశాధికారి అన్నపురెడ్డి గోపిరెడ్డి, కార్యదర్శి నందమూరి పద్మజ, కోశాధికారి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి మోహనరావు పాల్గొన్నారు.

అధ్వాన రహదారికి మరమ్మతులు చేపట్టాలి

కూచిపూడి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నిడుమోలులో జడ్పీ పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, మరమ్మతులు వెంటనే చేపట్టాలంటూ ఆదివారం గ్రామస్థులు నిరసన చేపట్టారు. జాతీయ రహదారి నుంచి జడ్పీ పాఠశాలకు వెళ్లే రహదారికి మరమ్మతు పనులు నాలుగు నెలల క్రితం చేపట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. పాఠశాలలకు, వైద్యశాలకు, సచివాలయానికి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఈ రహదారిపై నడవాలంటే ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. వెంటనే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దుల బసవయ్య, ఉప్పలపు వెంకటాద్రి, జొన్నలగడ్డ వాసు, కొనకళ్ల రాంబాబు, కొలుసు శ్రీను, పామర్తి ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నిడుమోలులో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

తాగునీటి మోటారుకు మరమ్మతులు

తోట్లవల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో జడ్పీ హైస్కూల్ ప్రక్కనే ఉన్న రక్షిత మంచినీటి పథకం మోటారు రెండు రోజుల క్రితం మరమ్మతులకు గురికావటంతో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శనివారం నుంచి పూర్తిస్థాయిలో తాగునీరు అందటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రక్షిత మంచినీటి పథకం వద్ద రెండు మోటార్లతో ట్యాంకు నింపి నీటిని సరఫరా చేసేవారు. వీటిల్లో ఒక మోటారు రిపేరుకి గురైంది. దీంతో ఉన్న ఒక్క మోటారుతోనే ట్యాంకు నింపి తాగునీరు అందిస్తున్నా అరకొరగానే అందుతున్నాయని ప్రజలు తెలిపారు. రిపేర్‌కు గురైన మోటార్‌ను విజయవాడకు పంపించి వైండింగ్ చేయిస్తున్నాము. సోమవారానికి మోటారు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సర్పంచ్ రాధిక తెలిపారు.



తోట్లవల్లూరులో రిపేర్‌కు గురైన సబ్‌మెర్సిబుల్ మోటార్

టీడీపీ సీనియర్ నేత మృతి

గుడివాడ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లింగవరానికి చెందిన ప్రముఖ టీడీపీ నేత గాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి (62) ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత 30 సంవత్సరాల నుంచి టీడీపీ క్రియాశీలక సభ్యుడిగా ఉన్నారు. లింగవరంలో టీడీపీకి అత్యధిక మెజార్టీ రావటానికి విశేష కృషి చేశారు. ప్రస్తుతం లింగవరంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. సోమవారం ఉదయం అంతిమయాత్ర నిర్వహించనున్నారు.



గాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసమాంబను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థుల ఉన్నతికి నరసమాంబ కృషి

గుడివాడ : 34ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో అనేక మంది విద్యార్థులకు ఉన్నతికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయురాలు పి.ఎల్ నరసమాంబ అని పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు నలంద దాసు అన్నారు. ఆదివారం స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నరసమాంబ పదవి విరమణ కార్యక్రమాన్ని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శర్మ, ఎల్.రమణ, ఉమా, శివ, ఆనంద్, రాజు, జయప్రద, రమ, బుజ్జి, విలియమ్ పాల్గొన్నారు.

ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గుత్తికొండ

గుడివాడ : ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గుడివాడకు చెందిన బీజేపీ నాయకుడు గుత్తికొండ రాజబాబు నియమితులయ్యారు. గుత్తికొండకు సముచిత స్థానం కల్పించారని పలువురు ప్రశంసించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రామినేని వెంకటకృష్ణ, నాయకులు సూరె గాంధీ, అంగడాల సతీష్, ఎర్రపోతు అర్జున్, మాచర్ల రామకృష్ణ, లీలాకుమారి, మురళీకృష్ణ, సంగటి త్రినాథ్, తదితరులు గుత్తికొండకు అభినందనలు తెలిపారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ రూరల్ : గంగాధరపురానికి చెందిన జుట్రూ వెంకట రామారావు కనిపించకుండా పోయాడు. అతడి భార్య కృష్ణకుమారి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. ఈ నెల 29వ తేదీన విజయవాడ వెళ్తున్నట్టు ఇంటి నుంచి ఉదయం బయలుదేరాడని కుటుంబ సభ్యులు తెలిపారు. 11.15 నిముషాలకు ఫోన్ చేయగా, ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చిందని, అప్పటి నుంచి కనిపించటం లేదు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కనకదుర్గ మహత్యం నాటకానికి విశేష స్పందన

గుడివాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న ఆనాటి పౌరాణిక నాటకాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తూ, నాటక ప్రదర్శనలకు అవకాశాలను కల్పిస్తోందని కళాకారుల సమైఖ్య నాయకులు పాత శ్యామ్ అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని చిన్నకార్ల స్టాండ్ వద్ద కార్ల ఓనర్స్ అండ్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, విజయవాడ సౌజన్యంతో నవ్యకళా మండలి అధ్యక్షురాలు జి.శివకుమారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి కనకదుర్గ మహత్యం(మహిషాసురమర్దిని) పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో కనకదుర్గగా బి.నాలగలక్ష్మీ, మహిషాసురుడిగా బి.శ్రీనివాస నాయుడు, నారదుడిగా పుప్పాల రంగారావు, చిత్రలేఖగా జి.శివకుమారి, శంకరునిగా జంక్షన్ అప్పారావు, దేవాంతకుడిగా బి.మోహన్, సిద్ధుగా బి.శోభారాణిల నటన ప్రేక్షకులను కట్టిపడేసింది. ముఖ్యంగా కనకదుర్గ మహత్యం నాటకాన్ని తిలకించేందుకు మహిళా భక్తులు తరలివచ్చారు.



కనకదుర్గ మహత్యం నాటకంలోని ఓ సన్నివేశం

వృద్ధురాలికి నిత్యావసరాల పంపిణీ

తోట్లవల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న మోర్ల హంస అనే వృద్ధురాలికి ఆదివారం విజయవాడ రూరల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో వీల్‌ఛైర్, నూతన వస్త్రాలు, రూ 5 వేల నగదు, నిత్యావసర సరుకులను సహాయంగా అందించారు. లయన్ ఇంజనీరు రావి సురేష్‌బాబు, లయన్స్‌క్లబ్ ప్రతినిధి చాగర్లమూడి గోపాలరావు చేతుల మీదుగా వృద్ధురాలికి అందజేశారు.గోపాలకృష్ణ, నాగార్జున, గుంటూరు కేశవరావు, బందెల కోటేశ్వరరావు, మోర్ల శంకర్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

గుడివాడ: స్థానిక మందపాడు న్యూకాలనీ బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ2,310ల నగదును స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా..!

- చెరువును తలపిస్తున్న రహదారి
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై తాడంకి అండర్‌పాస్‌ల వద్ద ఏర్పడిన బారీ గోతులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే రహదారిపై ఏర్పడ్డ గోతుల్లో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో ఏది గోతో, ఏది రహదారో తెలియక రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో నిత్యం వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవక తప్పడం లేదు. ముఖ్యంగా మంటాడ నుంచి కనుమూరు, గోపువాని పాలెం, మర్రివాడ, సాయిపురం, జబర్లపూడి, యలమర్రు గ్రామాల వైపు వెళ్లేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నిలిచిన వర్షపునీటిలో తమ వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోయి నరకయాతన పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. అండర్‌పాస్ సమస్య గురించి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. అండర్‌పాస్ సమస్యపై ఎమ్మెల్యే కుమార్ రాజా హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలో తాడంకి అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపునీరు

అధికారులు పట్టించుకోవడం లేదు



అండర్‌పాస్ వద్ద ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో మంటాడవైపు నుంచి మర్రివాడ, గోపువానిపాలెం, సాయిపురం రావాలంటే ఇబ్బంది పడుతున్నాము.

వై. రాజేంద్రప్రసాద్, మర్రివాడ

రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్య మయ్యాయి

రహదారిపై ఏర్పడిన గోతుల్లో నిలిచిన వర్షపు నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో నిలిచన వర్షపు నీటి వల్ల ఏది రహదారో, ఏది గోయ్యో తెలియక వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడక తప్పడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాల్లేవు.

శరత్, మర్రివాడ

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560



సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కుప్పంలో సీఎం చంద్రబాబును కలిసిన విక్కుర్తి



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న విక్కుర్తి శ్రీనివాసరావు

అవనిగడ్డ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కుప్పం నియోజకవర్గంలో కలిశారు. విక్కుర్తి శ్రీనివాస్ త్వరలోనే తెలుగుదేశం పార్టీలో చేరనున్నారని వదంతులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆయన కుప్పంలో చంద్రబాబును కలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. కుప్పం నియోజకవర్గానికి సాగునీటిని తీసుకురావటం ద్వారా చంద్రబాబు తన సామర్థ్యమేమిటో మరోసారి నిరూపించారని విక్కుర్తి శ్రీనివాస్ అన్నారు.

ఎదురుమొండి - గొల్లమంద రహదారి శంకుస్థాపనకు పవన్‌కల్యాణ్‌కు ఆహ్వానం



పవన్‌కల్యాణ్‌ను కలిసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మండలి

అవనిగడ్డ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎదురుమొండి - గొల్లమంద రహదారి శంకుస్థాపన కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. వరదల కారణంగా గొల్లమంద - ఎదురుమొండి గ్రామాల నడుమ రహదారి పూర్తిగా ధ్వంసం కాగా, రూ.13.88 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారి నిర్మాణానికి ఇటీవలే టెండర్లు పిలిచారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా పవన్ కల్యాణ్‌ను కోరినట్లు బుద్ధప్రసాద్ తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారని, శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసేందుకు అంగీకరించారని, త్వరలోనే తేదీ తెలియజేస్తామని బుద్ధప్రసాద్ తెలిపారు.

వీఆర్వో గొల్లపూడి రాజేంద్రకు ఘనసన్మానం



వీఆర్వో రాజేంద్ర దంపతులను సన్మానిస్తున్న ఆర్డీవో కె.స్వాతి, రెవెన్యూ అధికారులు

చల్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వో గొల్లపూడి రాజేంద్ర సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. చల్లపల్లి వీఆర్వోగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన గొల్లపూడి రాజేంద్ర అభినందన సభ చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం జరిగింది. డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆర్డీవో కె.స్వాతి, జడ్పీటీసీ సభ్యుడు రాజులపాటి కల్యాణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ప్రముఖులు దాసి సీతారామరాజు, పామర్తి వెంకటేశ్వరరావు, ఏఎస్‌వో అఖిలా ఫర్వీన్, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్ ఉద్యోగ సంఘం నేత వి.వి.మాధవేంద్రరావు, వీరమాచినేని భవానీ ప్రసాద్, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఆర్డీవో కార్యాలయ అధికారులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పైలెట్ స్వితిన్‌రాస్‌కు ఘనసన్మానం



చల్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ తనయుడు స్వితిన్‌రాస్ కెనడా డొమెస్టిక్ ఎయిర్ లైన్స్ కో-పైలెట్ నుంచి పైలెట్‌గా ప్రమోట్ కావడంతో చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా స్వితిన్‌రాస్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు.



చిట్టా గోపాలకృష్ణ శాస్త్రి పాఠశాల 1974-75 బ్యాచ్ పూర్వవిద్యార్థుల కలయిక

50 ఏళ్ల నాటి తీపి జ్ఞాపకాలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : చిట్టా గోపాలకృష్ణ శాస్త్రి మెమోరియల్ హైస్కూల్‌లో 1974-75 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. 50 ఏళ్ల తరువాత బందరుటౌన్ హాలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కోసూరి మాధవ, రమాదేవి, లక్ష్మి, గౌరి, నాగేశ్వరరావు, వెంకట రమణ, అజయ్, లక్ష్మి, విజయ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.




శోభ స్మారక కవితల పోటీల విజేతలతో డాక్టర్ రావి రంగారావు

సమాజ చైతన్య రచనలు చేయాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సమాజ చైతన్యం కోసం కవులు తమ కలాలకు పదును పెట్టాలని సాహితీ మిత్రుల వ్యవస్థాపకుడు, ఆంధ్రజాతీయ బీఈడీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రావి రంగారావు అన్నారు. రాష్ట్ర స్థాయి డాక్టర్ శోభ స్మారక కవితల పోటీల్లో విజేతలకు ఆదివారం మహతి కళావేదిక పై అవార్డులు అందజేశారు. మచిలీపట్నం సాహితీమిత్రులు అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కాకినాడకు చెందిన డి.నాగజ్యోతికి ప్రథమ,గుంటూరుకు చెందిన డాక్టర్ సూర్యదేవర రవికుమార్‌కు ద్వితీయ, హైదరాబాద్‌కు చెందిన ఎన్ లహరికి తృతీయ, ప్రత్యేక బహుమతులు అనకాపల్లికి చెందిన కోదాడ అప్పలరాజు, గండికోటకు చెందిన సుధీర్‌కుమార్‌కు అందజేశారు. డాక్టర్ వారణాసి శైలజ, భవిష్య, అప్పినేటి పోతురాజు, మహమ్మద్ సిలార్, కరెడ్ల సుశీల, వారణాసి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరి చిన్నాకు నెహ్రూ స్మారక పురస్కారం



పెడన, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పురస్కారం అందుకున్నారు. ప్రతిభ క్రీడా సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రముఖుల చేతులమీదుగా చిన్నాకు అవార్డు అందజేసింది.



బందరులో రూ.22 వేలకు పాడుకున్న లడ్డూ తీసుకెళ్తున్న భక్తుడు



మల్లేశ్వరంలో నిమజ్జనోత్సవానికి ఊరేగింపుగా వెళ్తున్న వినాయకుడు



మందపాకలలో పర్యవేక్షిస్తున్న సీఐ యువకుమార్

వైభవంగా గణపతి పూజలు..నిమజ్జనోత్సవం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆర్టీసీకాలనీ, రాజుపేట, బుట్టాయిపేట, సీఎంఆర్ షాపింగ్‌మాల్ వద్ద, బచ్చుపేట, తదితర ప్రాంతాలలో ఆదివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. లడ్డూ ప్రసాదాన్ని రూ.22 వేలకు పాడుకున్నాడు. పోలీసుశాఖ నెలకొల్పిన వినాయక పందిరిలో అన్నసమారాధన జరిపారు. నరసింహనగర్‌లో విజయగణపతి పందిరి వద్ద గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు కళాకారులను సత్కరించారు. కొన్ని మండపాలలోని వినాయకులను ఆదివారం నిమజ్జనం చేశారు. **పెడన** : బాల గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పత్తిపాటివారివీధిలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉత్సవాలు ముగింపు రోజైన ఆదివారం అన్నసమారాధన జరిగింది. మచిలీపట్నానికి చెందిన అల్లాడ నాగ రవికుమార్ వేలంలో స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని రూ. 25,500 లకు సొంతం చేసుకున్నారు. వినాయకుని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అధిరోహింపచేసి ఊరేగింపుగా తీసుకెళ్లి రామరాజుపాలెం కాల్వలో నిమజ్జనం చేశారు. పత్తిపాటి సోదరులు వెంకటరమణ, జయకృష్ణ నేతృత్వం వహించారు. **బంటుమిల్లి** : గణపతి నవరాత్రులలో భాగంగా ఐదో రోజైన ఆదివారం నాడు పెద్ద ఎత్తున నిమజ్జనోత్సవాలు జరిగాయి. దాదాపు 36కి పైగా విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మల్లేశ్వరంలోని బంటుమిల్లి ప్రధాన కాలవ, పెదపట్నం, మంగినపూడి బీచ్‌లలో నిమజ్జనం చేశారు. కనకడప్పులు, మేళతాళాలు, భజనలతో , ఊరేగింపులు కొనసాగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బంటుమిల్లి ఎస్సై గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో అదనపు సిబ్బందితో పర్యవేక్షణ చేశారు. **చల్లపల్లి** : వినాయక నిమజ్జన ఊరేగింపులు ఆదివారం ఘనంగా జరిగాయి. రామానగరం క్లబ్ రోడ్‌లోని చెరువువెనుక వినాయక చవితిని జరుపుకున్న చిన్నారులు గణపతిని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. చల్లపల్లి సెంటరులోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయం వద్ద గణపతికి ట్యాక్సీ డ్రైవర్లు, ఓనర్లు ఘనంగా ఊరేగింపు చేశారు. పాగోలు విశ్వబ్రాహ్మణ కాలనీలోని గణపతికి, సెంటరులోని వినా యకునికి ఊరేగింపు జరిపారు. నారాయణరావుకాలనీలో గణనాథుల తోపాటు పలు గ్రామాల్లోని గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనాలు చేశారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు. **కోడూరు** : వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీజేలు వద్దని, సంప్రదాయమే ముద్దు అని అవనిగడ్డ సీఐ యువకుమార్ అన్నారు. మందపాకల గ్రామంలో పోలీసు సూచనల మేరకు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సీఐ యువకుమార్, ఎస్సై చాణిక్య పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్:** వేళ్లమ్మ దేవస్థాన ప్రాంగణం దగ్గర ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామివారిని టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు దర్శించుకున్నారు. జనసేన పార్టీ నాయకుడు గుడివాక శివరావు, చందన నరసింహారావు, పిరాటి రాంబాబు, అడపా చింటు, ప్రభాకర్, వార్డు మెంబరు కమ్మిలి సాయి, మత్తి రేణుకయ్య, బచ్చు రాంబాబు, బచ్చు సాయి, కమ్మిలి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. వేకనూరు రామాలయం వద్ద వినాయకుడుని భక్తులు దర్శించుకున్నారు. **మోపిదేవి** : రావివారిపాలెం, వెంకటాపురం, పెదప్రోలు, పెదకళ్లేపల్లి గ్రామాల్లో నవ రాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కొక్కిలిగడ్డ, మోపిదేవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ఉత్సాహభరితంగా నిర్వహించారు.



కొక్కిలిగడ్డలో నిమజ్జన ఊరేగింపు



నంగేగడ్డలో సామూహిక సరస్వతీ పూజలు



రామానగరంలో గణపతిని నిమజ్జనానికి తీసుకువెళుతున్న చిన్నారులు

సామూహిక సరస్వతీ పూజలు

నాగాయలంక : నంగేగడ్డలోని పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఉత్సవ పందిరిలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఐదో రోజున విద్యార్థులచే సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో జరుగగా, ఉత్సవ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.

వినాయకుడి లడ్డూ రూ.22 వేలు



నాగాయలంక : టి.కొత్తపాలెం గ్రామంలోని పోస్టు ఆ ఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో చవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ఐదో రోజున వినాయక లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన రేమాల శ్రీనివాసరావు కృష్ణమూర్తి రూ.22 వేలు కు పాటపాడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.



ఐవీఎం ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లు, స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థినీ విద్యార్థులతో అతిథులు కొనకళ్ల నారాయణరావు, మండలి బుద్ధప్రసాద్, వేములపల్లి సురేష్

ఐవీఎం సురేష్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

చల్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యాభివృద్ధికి సహాయం చేస్తున్న ఐవీఎం సురేష్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పురిటిగడ్డ ఐవీఎం హోమ్‌లో ఇండియా విలేజ్ మినిస్ట్రీస్(ఐవీఎం) ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఉన్నత చదువులు చదివే వారికి స్కాలర్‌షిప్‌లను ఆదివారం పంపిణీ చేశారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఏ ఇబ్బంది వచ్చినా నేనున్నా అంటూ ఆదుకునే సేవా సంస్థ ఐవీఎం అన్నారు. పేద విద్యార్థులకు సేవ చేసే వేములపల్లి సురేష్ దంపతులను అభినందించారు. ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ, ఈ ఏడాది విద్యార్థులకు రూ.67 లక్షలను 175 మంది పిల్లలు చదువుకునేందుకు సహాయం అందిస్తున్నామన్నారు. 15 మంది విద్యార్థులకు రూ.7లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను అతిథుల చేతులమీదుగా అందచేశారు. ఇంటర్ నుంచి యూనివర్శిటీ స్థాయి వరకు 100 మందికి రూ.40 లక్షల స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. ఒకటి నుంచి పదవ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలల్లో చదివే 175 మందికి రూ.20 లక్షల మేర ఫీజులు చెల్లించారు. విశ్రాంత డీఎస్పీ కె.హరి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభలో వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, ఐవీఎం సభ్యులు ప్రసాద్, శ్రీనివాస్, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ జయప్రసాద్, డీఎస్పీ దుర్గారావు సతీమణి సుజాత, రైతు నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఐవీఎం ప్రతినిధులు వేములపల్లి రోజా, విజయ, స్వితిన్ రాస్, సోఫి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులు సమాజ సేవ చేయాలి



వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న బుల్లయ్య తదితరులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉపాధ్యాయులు సమాజ సేవలో భాగంగా పేద విద్యార్థులకు చదువు చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య అన్నారు. జార్జి కార్నేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రెండుచింతల వెంకటరమణ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని అభినందించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు, ప్రముఖ ఆడిటర్ కేతవరపు శివకుమార్, టీడీపీ రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పివి ఫణికుమార్, జార్జికార్నేషన్ కార్యదర్శి జయప్రకాష్, అధ్యక్షురాలు చిత్రపు సీతాదేవి, బందరు ఎంఈవో -2 గురుప్రసాద్, ఏపిటిఎఫ్ గౌరవాధ్యక్షుడు నడకుదిటి రామబ్రహ్మం, హిందూకళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ ఎఆర్‌కె మూర్తి, ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం చిత్రపు తిరుమలరావు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బోలెం నాగమణి



చల్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టరుగా తెలుగు మహిళా నేత, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి నియమితులయ్యారు. పలు కార్పొరేషన్ల డైరెక్టర్ల జాబితాలను ప్రభుత్వం విడుదల చేసింది. చల్లపల్లి మండల పరిషత్‌కు గత పాలకవర్గంలో వైస్ ఎంపీపీగా పనిచేసిన నాగమణి తెలుగుమహిళా నేతగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. డైరెక్టరుగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లకు నాగమణి కృతజ్ఞతలు తెలిపారు.

నీట్‌లో ప్రతిభ చూపిన అక్షయకు సత్కారం



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నీట్‌లో మెరిట్ అభ్యర్థిగా సిద్దార్థ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించిన కుంపటి అక్షయను మల్కాపట్నం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. పేర్ని కృష్ణమూర్తి కాలనీలో నివసిస్తున్న కుంపటి ప్రసాద్, అమ్మాజీల పుత్రిక కుంపటి అక్షయ కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించిందన్నారు. విశ్రాంత బ్యాంక్ ఆఫీసర్ కొడాలి అజయ్‌కుమార్, బీడెల్లి కుమార్, పెనుమత్స మధు, బండారు నాని, కొడాలి యోహాన్, సుధీర్, మట్టా జయప్రకాష్, దేవపాలన, కార్పొరేటర్ అనిత, చిట్టూరి యువరాజ్, ఎమ్మార్పీఎస్ బందరు అధ్యక్షుడు జూనపూడి గణేష్, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జుజ్జవరపు అనిల్‌కుమార్, లెక్చరర్ సురేష్, బందెల థామస్, టీచర్ శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక భగవద్గీత పారాయణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈడేపల్లిలోని భగవాన్ సత్యసాయి మందిరంలో ఆదివారం 280 మంది భగవద్గీతలోని 700 శ్లోకాల పారాయణ చేశారు. జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, అన్నపూర్ణ, జొన్నలగడ్డ మాధవి తదితరులు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో ఉన్నత లక్ష్యాల సాధన

చల్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు దృఢ సంకల్పంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని జనవిజ్ఞానవేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. విజయక్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'గెలవడానికి మాకో ప్రపంచం ఉంది' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, కళాశాల కరస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కె.జె.చంద్రరావు, విశ్వనాథ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.